ఉపాధికి కార్యాచరణ సిద్ధం !

- నేడు అన్ని పంచాయతీల్లో ఉపాధి హామీ గ్రామ సభలు
- కొత్త పనులు గుర్తించేందుకు ప్రణాళికలు
- హాజరుకానున్న నోడల్ ఆఫీసర్, చైర్మన్, కన్వీనర్లు


డి.పోలవరం గౌరలింగం చెరువులో పూడిక తీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

తుని రూరల్: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మరిన్ని పనులు గుర్తించేందుకు ప్రభుత్వం శుక్రవారం అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కూలీలు పనులు చేసేందుకు గతేడాది డిసెంబర్ వరకు పనులు గుర్తింపు, అధికారుల ఆమోదం ప్రక్రియ కొనసాగింది. రూ.45.77 కోట్ల విలువైన 3425 పనులు గుర్తించారు. వీటితో 15.81 లక్షలు పనిదినాలు కల్పించాల్సి ఉంది. ఏప్రిల్‌లో చేపట్టిన పనులతో ఇప్పటివరకూ 7.49 లక్షల పని దినాలను కూలీలు పూర్తి చేశారు. ఇంకా మిగిలిఉన్న 8.32 లక్షల పని దినాలను 2025 మార్చి 31కి పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతుండడం, వర్షాలు కురుస్తుండడంతో సాగునీటి చెరువుల్లో వరదనీరు చేరగా పంట కాలువల్లో సాగునీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణ పనులే జరుగుతున్నాయి. ఇతరేతర ఉపాధి పనులన్నీ నిలిచిపోయాయి. ఉపాధి పనులు పునరుద్ధరించేందుకు అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఇటీవల కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో ఉన్న పనులతో పాటు మరిన్ని పనులు చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. దీనిలో భాగంగా కొత్త పనులు గుర్తింపు, గుర్తించిన పనులకు ప్రజా ఆమోదం తెలిపేందుకు శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

ఉపాధిలో చేపట్టే వ్యవసాయ అనుబంధ పనులు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 38 రకాల వ్యవసాయ, అనుబంధ పనులు చేపట్టవచ్చు. కొత్తగా ఫీడర్ కాలువలు, పంట కాలువలు, రైతుల భూముల్లో ఫార్మ్ పాండ్‌లు, బెంచ్ టెర్రెసింగ్, భూముల సరిహద్దు కందకాలు, వ్యవసాయ బావుల నిర్మాణం చేపట్టవచ్చు. పండ్ల తోటల్లో రింగు ట్రెంచులు, భూసార సంరక్షణ కందకాల తవ్వకం, వ్యవసాయ క్షేత్రాల్లో గడ్డి పెంపకం, పశువుల షెడ్లు, గొర్రెల షెడ్లు, కోళ్లఫారాలు, పట్టు పురుగుల రేరింగ్ షెడ్లు, ఎంఐ ట్యాంకులు పునరుద్ధరణ, ప్రభుత్వ సంస్థల్లో సరిహద్దు కందకాలు, పండ్లతోటల పెంపకం, పూలతోటల పెంపకం, మల్బరీ తోటలు పెంపకం, నర్సరీలు పెంపకం, మునగ నర్సరీలు, టేకు, ఇతర అటవీ మొక్కలు పెంపకం, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు పెంపకం, కొండ ప్రాంతాల్లో మొక్కలు పెంపకం, రోడ్లకు రెండు వైపులా మొక్కలు పెంపకం, కెనాల్ గట్లపై మొక్కలు పెంపకం, కమ్యూనిటీ భూముల్లో బ్లాక్ ప్లాంటేషన్, మడ అడవుల పెంపకం, పంట కాలువలు, నీటిపారుదల కాలువల్లో పూడిక తీతలు తదితర పనులు చేయవచ్చు. వీటితో పాటు మెటీరియల్ వర్కులుగా సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, గ్రామాల్లో నిర్దేశించిన ప్రభుత్వ భవనాలు, చెక్‌డ్యాం నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉంది.

తుని నియోజకవర్గంలో గుర్తించిన ఉపాధి పనుల విలువ, పూర్తిచేసిన పని దినాలు

మండలం	గుర్తించిన పనులు	పనుల మొత్తం విలువ	పని దినాల లక్ష్యం	పూర్తయిన పని దినాలు
తుని	1434	రూ.19.27 కోట్లు	7.08 లక్షలు	2.95 లక్షలు
కోటనందూరు	720	రూ.16.5 కోట్లు	5.15 లక్షలు	2.90 లక్షలు
తొండంగి	1271	రూ.10.00 కోట్లు	3.53 లక్షలు	1.64 లక్షలు
మొత్తం	3425	రూ.45.77 కోట్లు	15.81 లక్షలు	7.49 లక్షలు

కొత్త పనులు గుర్తించేందుకు గ్రామ సభలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో మరిన్ని కొత్త పనులు గుర్తించేందుకు శుక్రవారం మండలంలోని 23 గ్రామాల్లోనూ సభలు నిర్వహిస్తున్నాం. ఈ గ్రామ సభలకు నోడల్ ఆఫీసర్‌గా మండలస్థాయి అధికారి, చైర్మన్‌గా సర్పంచ్, కన్వీనర్‌గా పంచాయతీ కార్యదర్శి హాజరవుతారు. రైతులు, వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలు పాల్గొని ప్రజావసరాలకు అనువైన పనులు సూచించవచ్చు. కొత్తగా గుర్తించిన ఈ పనులపై చర్చించి గ్రామ సభలు ఆమోదించాల్సి ఉంది.

– పసుపులేటి నారాయణరావు, ఏపీఓ, తుని

క్లుప్తంగా

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

గండేపల్లి: మండలంలోని ప్రధాన రహదారులపై నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన నిందితులకు పెద్దాపురం కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించినట్టు స్థానిక ఎస్సై యువీ శివ నాగబాబు తెలిపారు. గతవారం రోజుల పాటు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌ల్లో పట్టుబడ్డ ఆరుగురు వ్యక్తులను గురువారం కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున జరిమానా, ఇద్దరికి మూడు రోజుల చొప్పున జైలు శిక్ష విధించినట్టు పేర్కొన్నారు.

రేపు ఏలేశ్వరంలో జాబ్ మేళా

ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరుకు చెందిన సుప్రజీత్ ఇంజినీరింగ్ లిమిటెడ్, బిగ్ బిస్కెట్, చెన్నైకు చెందిన మదర్‌సన్ సుమీ వైరింగ్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లమో ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.14,150 నుంచి రూ.19 వేల వరకూ జీతం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఉదయం 9 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

నేడు ఉపాధి హామీ గ్రామ సభలు

కిర్లంపూడి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు గుర్తించేందుకు శుక్రవారం అన్ని పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సోమవరం గ్రామం, 11 గంటలకు భూపాలపట్నం, గెద్దనాపల్లి, గోనేడ, జగపతినగరం, కృష్ణవరం, ముక్కొల్లు, రాజుపాలెం, ఎస్.తిమ్మాపురం, సింహాద్రిపురం, సోమరాయణంపేట, శృంగరాయునిపాలెం, తామరాడ గ్రామాల్లో సభలు నిర్వహిస్తారన్నారు. సాయంత్రం 3 గంటలకు బూరుగుపూడి, పాలెం, రామచంద్రపురం, వీరవరం, వేలంక గ్రామాల్లో నిర్వహించే సభలకు ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, ఉపాధి కూలీలు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

జోరుగా సేవా కార్యక్రమాలు


ఏలేశ్వరంలో రోగులకు రొట్టెలు, పాలు అందజేస్తున్న చిరంజీవి అభిమానులు

ఏలేశ్వరం: సినీ హీరో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని గురువారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణ మెగా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. బ్లడ్ బ్యాంకు ద్వారా చిరంజీవి చేస్తున్న సేవా కార్యక్రమాలు కొనియాడారు. పలువురు చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

గండేపల్లి: సినీ హీరో చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా మండలంలోని మల్లేపల్లిలో గురువారం జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పేదలకు పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు.

గజ్జనపూడిలో మొక్కలు నాటే కార్యక్రమం

ప్రత్తిపాడు రూరల్: తల్లి పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని గజ్జనపూడిలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఖాళీ స్థలాల్లో గ్రామంలోని ప్రజాప్రతినిధులు మొక్కలు నాటారు. మొక్కల పెంపకం ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సింగిడి వెంకటేష్, నాయకులు జక్కా సత్యనారాయణ, ఈగల చక్రరావు, గారా గంగరాజు, చింతపల్లి నూకరాజు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

డాక్టర్ ఉమర్ ఆలీషా

పిఠాపురం: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని శ్రీవిశ్వవిజ్ఞాన విద్యా, ఆధ్యాత్మిక విద్యా పీఠం చైర్మన్ డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథి డాక్టర్ ఉమర్ ఆలీషా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా ఒక్కొక్క మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ముందుగా డాక్టర్ ఉమర్ ఆలీషా మొక్కలు నాటగా, అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ వి.కేశవరావు, అధ్యాపకులు ఎం.సుందరయ్య, డాక్టర్ కే.శారద, డాక్టర్ ఎం.రామారావు, ఉదయభాస్కర్, లైబ్రేరియన్ ఎండీ హుస్సేన్, ఎన్ఎస్ఎస్ పీఓలు డీవీ కాశీవిశ్వనాథం, వి.బుల్లి ప్రసాద్ తదితరులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ఏవీవీ సత్యనారాయణ, రేఖా ప్రకాష్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


మల్లిసాల కృష్ణాష్టమి వేడుకల్లో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ

జగ్గంపేట: మండలంలోని మల్లిసాల అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ మాట్లాడుతూ కృష్ణాష్టమి ప్రాధాన్యతను వివరించారు. ఇలాంటి వేడుకలు నిర్వహించడం వల్ల పిల్లల్లో మన పండగలు, సంస్కృతిపై అవగాహన పెరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అమ్మాజీ, అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తుని: స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్టు కమిషనర్ వెంకట్రావు గురువారం తెలిపారు. సమావేశంలో పట్టణాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తారన్నారు. వివిధశాఖలకు చెందిన అధికారులు, కౌన్సిలర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

నేటి నుంచి ధనలక్ష్మి అమ్మవారి ఉత్సవాలు


కొత్తయర్రవరంలోని ధనలక్ష్మి అమ్మవారు

ఏలేశ్వరం: మండలంలోని కొత్తయర్రవరంలో వేంచేసిన ధనలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 1వ తేదీ వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు నవశక్తి వేషాలు, బండ్ల వేషాలు, తీన్‌మార్, బాణసంచా కాల్పులు, కుంకుమ పూజలు నిర్వహిస్తారు. 24న భజనకాలక్షేపం, 25న ముగ్గుల పోటీలు, 26న కోలాటం, 27, 28 తేదీల్లో భజన కాలక్షేపం, 29న అన్నసమారాధన, వెంకన్నబాబు పాట, 30న కుంకుమ పూజలు, వచ్చే నెల 1న బోనాల ఊరేగింపు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు వివరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు.

వైభవంగా ఆలయ శిఖర ప్రతిష్ఠ


తామరాడలో కనకదుర్గమ్మ ఆలయ శిఖరాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

కిర్లంపూడి: మండలంలోని తామరాడలో ఏలేరు నది ఒడ్డున వేంచేసిన కనకదుర్గమ్మ ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఆలయ పండితులు దేవరబట్ల రాజా, ప్రవీణ్, మూర్తిశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి ఆలయంపై శిఖరాన్ని ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన 108 మంది ఆడపడుచులు కలశాలతో ఏలేరు నదీ జలాలను తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి


రంగవల్లి నగర్‌లో ఆందోళన చేస్తున్న రైతు కూలీ సంఘం నేతలు

జగ్గంపేట: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలోని ఫార్మా కంపెనీలో జరిగిన పేలుడు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం, భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో జగ్గంపేట శివారు రంగవల్లి నగర్‌లో గురువారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మరుకుర్తి ఏసు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో 17 మంది కార్మికులు మృతి చెందడం, 60 మంది క్షతగాత్రులు కావడం బాధాకరమన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించని కంపెనీ యాజమాన్యంపై హత్యానేరం కేసు నమోదు చేయాలని, మృతులు, క్షతగాత్రుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య, రైతు కూలీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఘనంగా పరదేశమ్మ జాతర


కొత్త సూరవరంలో పరదేశమ్మను దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తుని రూరల్: మండలంలోని కొత్త సూరవరంలో కొలువైన పరదేశమ్మ అమ్మవారి జాతర మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు నల్లల వరహాలు, కార్యదర్శి తర్రా దొరబాబు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి జాతర, గురువారం తీర్థం నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. తుని, ఎస్.అన్నవరం, రామకృష్ణా కాలనీ, తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దాతల సహకారంతో ప్రసాదాలు వితరణ, మజ్జిగ పంపిణీ, అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు యనమల కృష్ణుడు, దేవారపు సూర్యచక్రం, సకురు నాగేంద్ర నెహ్రూ, గంటా చక్రరావు, గాది వరహాల బాబు, రెడ్డి వీరబాబు, వేముల శివనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీరబాబుకు వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ


సీతారాంపురంలో వీరబాబును పరామర్శించిన తోట రాంజీ, నాయకులు

జగ్గంపేట: మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త రాయి వీరబాబు ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం తనయుడు తోట రాంజీ, పార్టీ నాయకులు గురువారం వీరబాబును పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు రావుల గణేష్ రాజా, పార్టీ నేతలు కరుటూరి వీర్రాజు, మడగల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు తోట రాంజీ పరామర్శ

గండేపల్లి: మండలంలోని పలు బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ నాయకుడు తోట రాంజీ గురువారం పరామర్శించారు. మురారిలో సుంకవిల్లి సత్యనారాయణ, నీలాద్రిరావుపేటలో దుంగల రమణమ్మ, గండికోట వీరబాబు, కిలాడి కాటయ్య ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను తోట రాంజీ పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షులు మద్దిపట్ల రామకృష్ణ, ఐవీ గోపి తదితరులు ఉన్నారు.

గ్రామ సభలకు ప్రత్యేకాధికారుల నియామకం

ప్రత్తిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనులను గుర్తించేందుకు శుక్రవారం గ్రామ పంచాయతీల్లో నిర్వహించే గ్రామ సభలకు ప్రత్యేకాధికారులను నియమించినట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు గురువారం తెలిపారు. పోతులూరు గ్రామసభకు డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతి, గజ్జనపూడి, రాచపల్లి గ్రామాలకు ఎంఈఓ వి.రాజబాబు, శరభవరం, పెదశంకర్లపూడి గ్రామాలకు ఈఓఆర్డీ కేవీపీఎస్ కాశీ విశ్వనాథం, ధర్మవరం, ఏలూరు గ్రామసభలకు వెలుగు ఏపీఎం వై.వెంకట్, ఉద్దండ జగన్నాథపురం, గోకవరం గ్రామాలకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేష్, లంపకలోవకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.మంగారత్నం, ప్రత్తిపాడుకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, ఒమ్మంగికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ చక్రవేణి, చినశంకర్లపూడికి ఉపాధి హామీ పథకం జేఈ జి.కమల, చింతలూరు, బురదకోటకు ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాజా, బవురువాక, పాండవులపాలెం, రౌతుపాలెం, ఉత్తరకంచి, వెంకటనగరం, టి. రాయవరం, పెద్దిపాలెం గ్రామ సభలకు ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బంది భాను ప్రకాష్, ఎ.రామ్‌కుమార్, టి.సతీష్, బి.సత్యనారాయణలను నియమించినట్టు ఆయన వివరించారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు గ్రామ సభలకు హాజరుకావాలని ఆయన కోరారు.

సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలిగా విజయదుర్గ



శంఖవరం: సర్పంచుల సమాఖ్య మండల అధ్యక్షురాలిగా జి.కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఈగల విజయదుర్గ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని అన్నవరంలో గురువారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎస్సీ, ఎస్టీ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార్ రాజా అధ్యక్షతన మండలస్థాయి గ్రామ సర్పంచుల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచులు విజయదుర్గను మండల అధ్యక్షురాలిగా, కార్యదర్శిగా వజ్రకూటం సర్పంచ్ సకురు గుర్రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కుమార్‌రాజా మాట్లాడుతూ సర్పంచుల సమస్యల పరిష్కారానికి సమాఖ్య కృషి చేస్తుందన్నారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచులు సమష్టిగా పని చేయాలని సూచించారు.

అన్నపూర్ణాదేవికి కాసు బంగారు, పట్టు వస్త్రాల సమర్పణ


అమ్మవారికి బంగారం, పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దాత సీతారామశాస్త్రి, పద్మావతి దంపతులు

కిర్లంపూడి: మండలంలోని చిల్లంగి గ్రామంలో వేంచేసిన అన్నపూర్ణాదేవి అమ్మవారికి దాత ఆరాధ్యుల వెంకట సీతారామశాస్త్రి, పద్మావతి దంపతులు గురువారం కాసు బంగారు నల్లపూసలు దండ, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ తమ మనవరాలు ధాత్రి నైషిక పుట్టిన రోజు సందర్భంగా అమ్మవారికి బంగారు ఆభరణం, పట్టు వస్త్రాలు సమర్పించామన్నారు. ఈ మేరకు వాటిని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆయిల్ మాఫియా కేంద్రాలపై పోలీసుల దాడి


అక్రమ ఆయిల్ స్థావరాలను తొలగిస్తున్న ఎస్సై కృష్ణమాచారి, పోలీసులు

ప్రత్తిపాడు: జాతీయ రహదారి వెంబడి ఉన్న ఆయిల్ మాఫియా కేంద్రాలపై పోలీసులు గురువారం సాయంత్రం దాడులు నిర్వహించి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రత్తిపాడు, ధర్మవరం, ధర్మవరం గ్రామ శివారులోనూ ఆయిల్ మాఫియా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. సుదూర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్న లారీలు, భారీ వాహనాల నుంచి ఆయిల్‌ను తక్కువ ధరకు కొనుగోలు చేసి అక్రమ మార్గంలో అధిక ధరకు విక్రయించడం ఈ మాఫియా పని. దీనిపై ప్రత్తిపాడు ఎస్సై ఎం పవన్‌కుమార్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని ఆయన తెలిపారు.

స్థావరాలు ధ్వంసం

తుని రూరల్: మండలంలోని ఎర్రకోనేరు సమీప మామిడి తోటల్లో అక్రమంగా ఏర్పాటు చేసిన ఆయిల్ స్థావరాలను రూరల్ పోలీసులు ధ్వంసం చేశారు. గురువారం రూరల్ ఎస్సై బి.కిష్టమాచారి ఆధ్వర్యంలో పోలీసులు రెండు ఆయిల్ స్థావరాలను తొలగించారు. ఉన్నత అధికారుల ఆదేశాలతో అక్రమ ఆయిల్ మాఫియా, అసాంఘిక కార్యకలాపాలను నిరోధించడంలో భాగంగా స్థావరాలను తొలగించినట్టు ఎస్సై తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

తొండంగి మండలంలో...

తొండంగి: మండలంలోని బెండపూడి జాతీయ రహదారి వెంబడి అక్రమంగా నిర్వహిస్తున్న ఆయిల్ షాపులపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. తమ్మయ్యపేట సమీపంలోని లారీల నుంచి సేకరించి విక్రయిస్తున్న ఆయిల్ షాపులపై ఎస్సై జగన్మోహన్‌రావు సిబ్బందితో దాడి చేశారు. ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి 70 లీటర్ల ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



జి.కొత్తపల్లిలో జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ఏఓ గాంధీ

జగ్గంపేట: సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి రెడ్ల శ్రీరామ్ పేర్కొన్నారు. మండలంలోని గొల్లలగుంటలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. డీపీఎం ఇలియాజర్ మాట్లాడుతూ రైతుల అవసరానికి మించి ఎరువులు, పురుగులు మందులు వాడరాదన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వేప కషాయం, జీవామృతం, పంచగవ్య వంటి సేంద్రియ ఎరువులు వినియోగిస్తే నాణ్యమైన దిగుబడులు వస్తాయన్నారు. పంటలను ఆశించే చీడపీడల నివారణకు వాడాల్సిన కషాయాలు, జీవామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో అధిక లాభాలు

శంఖవరం: సేంద్రియ ఎరువులను వాడి వరిసాగు చేయడం ద్వారా అధిక లాభాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ రైతులకు సూచించారు. మండలంలోని జి.కొత్తపల్లిలో జీవామృతం తయారీని గురువారం ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతుల్లో వరి సాగు చేయాలన్నారు. సేంద్రియ ఎరువులు వాడడం ద్వారా రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు సాధించవచ్చన్నారు. అనంతరం సామూహిక ఎలుకల నివారణపై రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వీఏఏ క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల వాడకం తగ్గించాలి


కామరాజుపేటలో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

గోకవరం: పంట పొలాల్లో అధిక పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రాజరాజేశ్వరి రైతులకు సూచించారు. కామరాజుపేటలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేలైన యాజమాన్య పద్ధతులతో మాత్రమే నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పురుగు మందుల వాడకం తగ్గించి నాణ్యమైన ఆహార ఉత్పత్తులు పండించాలని తెలిపారు. అనంతరం పంటపొలాలను పరిశీలించి ఆకుముడత పురుగును గమనించారు. పురుగు నివారణకు 5 శాతం వేప గింజల కషాయం కాని, వేప నూనె కాని, 2 గ్రాముల కార్టప్ హైడ్రోక్లోరేడ్ పొడిని గాని లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.